ప్రధాన బస్టాండు ఎదురుగా నాలుగంతస్తుల భవన నిర్మాణం సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించకుండానే కడుతున్నారు. పట్టణ ప్రణాళిక అధికారులు ఆలస్యంగా స్పందించి నోటీసులు ఇచ్చారు.

జిల్లా కేంద్రం సరస్వతీనగర్‌లో ఓ ప్రముఖ వైద్యుడు సెట్‌బ్యాక్ వదలకుండానే ఆసుపత్రి నిర్మించారు. ఆలస్యంగానే మేల్కొన్న అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు.

దేవీరోడ్డులో ఓ భవన నిర్మాణం పూర్తయి అందులోకి ఓ ప్రముఖ వస్త్ర దుకాణం వచ్చింది. ప్రధాన చౌరస్తాలో ఉన్న ఈ దుకాణం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని అప్పటి వరకు గుర్తించలేకపోయారు. తీరా అది ప్రారంభమయ్యాక నోటీసులు ఇవ్వడం కొసమెరుపు.

ఆక్రమణల్లో.. తగ్గేదేలే

- సెట్‌బ్యాక్ లేకుండానే నిర్మాణాలు
- కొత్త వారూ నిబంధనలు బేఖాతరు
- చోద్యం చూస్తున్న పట్టణ ప్రణాళిక విభాగం

న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం

జిల్లా కేంద్రంలో భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. చాలా మంది అనుమతి ఒకలా తీసుకొని నిర్మాణం మరోలా చేపడుతున్నారు. దీంతో రోడ్లు ఇరుకుగా మారి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. అక్రమ నిర్మాణాలపై గతంలోనే చర్యలు చేపట్టాల్సిన పట్టణ ప్రణాళిక అధికారులు 'మామూళ్ల'గా వదిలేయడంతో పరిస్థితి చేయిదాటిపోయింది. ఇప్పుడైనా మేల్కొన్నారా అంటే అదీ లేదు. ప్రస్తుతం కూడా బహుళ అంతస్తుల భవనాలు, వ్యాపార సముదాయాలు, ఆసుపత్రులు నిబంధనలు పాటించకుండానే నిర్మిస్తున్నారు. వీరికి నగరపాలక సంస్థ నుంచి ఎలా అనుమతులు వచ్చాయో తెలియని పరిస్థితి.

ఇరుకిరుకుగా ఖలీల్‌వాడీ

ఖలీల్‌వాడీలో 300లకు పైగానే ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. దాదాపు సగానికి పైగా భవనాలకు పార్కింగ్



ఇరుకుగా మారిన రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం రోడ్డు

సౌకర్యం లేదు. చికిత్స కోసం వెళ్లిన వారు తమ వాహనాలు రోడ్లపైనే ఆపాల్సి వస్తోంది. ఇక్కడ 30 ఫీట్లు, 40 ఫీట్ల రోడ్లు ఉన్నాయి. నిబంధనల ప్రకారం రోడ్డును ఆనుకొని 200 గజాల స్థలం ఉంటే 5 మీటర్ల సెట్‌బ్యాక్, 300 గజాలు ఉంటే 7 మీటర్లు, విస్తీర్ణాన్ని బట్టి స్థలం వదిలి నిర్మాణం చేసుకోవాలి. నిబంధనల ప్రకారం 40 ఫీట్ల రోడ్డులో కమర్షియల్ నిర్మాణాలు చేపట్టొద్దనే నిబంధన ఉంది. కానీ, ఇక్కడ కొందరు రెసిడెన్షియల్ అనుమతులు పొంది ఆసుపత్రులు కట్టారు.

గాంధీచౌక్‌లో పరిస్థితి అధ్వానం

గాంధీచౌక్ నగరంలో ప్రధాన వ్యాపార ప్రాంతం. ఇక్కడి నుంచి రైల్వేస్టేషన్ వరకు 100 ఫీట్ల రోడ్డు ఉంది. నిబంధనల ప్రకారం 10 మీటర్ల పైగానే సెట్‌బ్యాక్ వదిలి భవనాలు నిర్మించుకోవాలి. ఈ ప్రధాన రహదారిలో నిత్యం వేలల్లో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వ్యాపారులు ఇరువైపులా రోడ్డు అంచు వరకు నిర్మాణాలు చేపట్టారు. పైగా నీడ పేరుతో రేకులు వేసుకొని ఫుట్‌పాత్ ఆక్రమించారు. ఈ మార్గంలో ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ అంతరాయం ఉంటుంది. పైగా దుకాణాల ఎదుట తోపుడు బండ్లు సైతం నిలుపుతుండటంతో రోడ్డు మరింత ఇరుకవుతోంది.

తగిన చర్యలు తీసుకుంటాం

నగరంలో ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని చర్యలు చేపడుతున్నాం. సెట్‌బ్యాక్ వదలని భవనాలు, సెల్లార్లలో దుకాణాలు నిర్వహిస్తున్న వారికి, రోడ్లు ఆక్రమించిన వారికి పోలీసు శాఖ, పట్టణ ప్రణాళిక విభాగం సంయుక్తాధ్వర్యంలో నోటీసులు ఇస్తున్నాం. స్పందించని వారిపై చర్యలు చేపడతాం.

- సత్యనారాయణ, పట్టణ ప్రణాళిక అధికారి

నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ నుంచి రెండు గేట్లు ఎత్తి 5 వేల క్యూసెక్కులు మంజీరలోకి, 2 వేల క్యూసెక్కులు నిజాంసాగర్ ప్రధాన కాల్వకు వదులుతున్నట్లు జలవనరుల శాఖ ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. ఇన్‌ఫ్లో 6 వేల క్యూసెక్కులు వస్తోందని చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 17.802 టీఎంసీలు నిల్వ ఉందని పేర్కొన్నారు.

విద్యుత్తు అంతరాయం నేడు

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: నగరం డీ-9 సెక్షన్ పరిధిలో మరమ్మతుల కారణంగా కంఠేశ్వర్, బైపాస్ రోడ్డు, చంద్రశేఖర్ కాలనీ ప్రాంతాల్లో గురువారం ఉదయం 10 నుంచి 11 వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ-2 తోట రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

తొలిరోజు 220 మంది

అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

డీఎస్సీ-2024కి సంబంధించి ధ్రువపత్రాల పరిశీలన జిల్లా కేంద్రం నిర్మల హృదయ పాఠశాలలో బుధవారం ప్రారంభమైంది. తెల్లవారు జామున ఎస్జీటీ ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించిన 1:3 నిష్పత్తి మెరిట్ జాబితాలు వెలువడ్డాయి. అభ్యర్థుల చరవాణులకు సంక్షిప్త సందేశాలు వచ్చాయి.

13 కౌంటర్లు ఏర్పాటు

అభ్యర్థులకు ఇబ్బంది తలెత్తకుండా ధ్రువపత్రాల పరిశీలనకు పక్కాగా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల హాజరు, ప్రాథమిక సమాచార సేకరణ, పరిశీలనకు ప్రత్యేకంగా 13 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. మాధ్యమాల వారీగా ధ్రువపత్రాలు పరిశీలించారు. అమావాస్య ఉండటంతో మొదటి రోజు ఎక్కువగా రాలేదు. గురువారం నుంచి పెరిగే అవకాశం ఉన్నందున 20 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ వెల్లడించారు. మొత్తం 403 ఎస్జీటీ పోస్టులకు 1209 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా తొలి రోజు 220 మందివి మాత్రమే ధ్రువపత్రాల పరిశీలన పూర్తయింది.



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఉపాధ్యాయ బృందాలు

పూర్తిస్థాయి జాబితాలు విడుదల

బుధవారం వేకువజామున ఎస్జీటీ మెరిట్ జాబితాలు ప్రకటించిన విద్యాశాఖ సాయంత్రం పీఈటీలవి, తర్వాత స్కూల్ అసిస్టెంటు, భాషా పండితుల జాబితాలు విడుదల చేసింది. అందులో పేర్లున్న అభ్యర్థులకు ప్రత్యేకంగా సంక్షిప్త సందేశాలు సైతం పంపారు. వారంతా గురువారం నుంచి ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని డీఈవో కార్యాలయం సూచించింది.



చెంపకు గాయంతో చిన్నారి

చిన్నారిపై వీధికుక్క దాడి

ఇందూర సిటీ, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రం కోటగల్లీ మైసమ్మ వీధిలో బుధవారం హరనేత్ర(6)పై వీధి కుక్క దాడి చేసింది. స్థానికుల కథనం ప్రకారం.. కిరాణా దుకాణంలో బిస్కెట్లు కొనుగోలు చేసి ఇంటికి వస్తుండగా కుక్క వెంబడించి చెంపపై కరిచింది. తల్లిదండ్రులు బాలికను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెదడుకు సమీపంలో గాయం కావడంతో వైద్యుల సూచన మేరకు రూ.11 వేలు వెచ్చించి బయట నుంచి ప్రత్యేక టీకా తెప్పించి ఇచ్చారు. వీటి సంతతి రోజురోజుకు పెరగడంతో నిత్యం ఎక్కడోచోట ఘటనలు జరుగుతున్నాయి.

తీరొక్క పూలు తెచ్చి.. బతుకమ్మను పేర్చి

పండగలో భాగం అవుతున్న చిన్నారులు

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

'చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ' అంటూ పాటలు పాడుతున్నారు.. తీరొక్క పూలుతెచ్చి బతుకమ్మలు పేరుస్తున్నారు.. సంస్కృతి సంప్రదాయాలు కాపాడుతున్నారు చిన్నారులు. అమ్మవారి పాటలు పాడుతున్నారు.. కవితలు రాస్తున్నారు.

స్నేహితులకు నేర్పించా

- ఆరాధ్య, పద్మానగర్, నిజామాబాద్



బతుకమ్మ అంటే ఎంతో ఇష్టం. గునుగ, తంగేడు, సీతమ్మవారిజడ తదితర పూలు సేకరించడం, బతుకమ్మను పేర్చడం అమ్మ నుంచి నేర్చుకున్నా. మా బడిలో జరిగిన వేడుకల్లో స్నేహితులతో కలిసి పేర్చా. పాటలు కూడా పాడా.

పూల సేకరణకు వెళ్తాం

- లాస్య, బోర్గాం(పి)



ఏటా పూల సంబరంలో ఊరంతా పాల్గొంటుంది. గునుగ, తంగేడుతో పాటు వివిధ రకాల పూల సేకరణకు పిల్లలమంతా వెళ్తాం. ఇంటి ఎదుట ముగ్గులు వేయడం, తమలపాకుల మీద పసుపుతో గౌరమ్మను ఉంచడం, హారతులు ఇవ్వడం నేనే చేస్తా. పూజ ఎలా చేయాలో కాలనీ పిల్లలకు నేర్పించా.

పాటలు పాడుతున్నా...

- సంజన, ఆర్యనగర్, నిజామాబాద్



బతుకమ్మ వచ్చిందంటే చెప్పలేనంత ఆనందం నాకు. అమ్మ నుంచి పాటలు నేర్చుకున్నా. డీజే పాటలు కాకుండా సొంతంగా పాడటం నచ్చుతుంది. మన సంప్రదాయాలు మనమే కాపాడుకోవాలి.

కవితలు రాశా..

- వైష్ణవి, తడపాకల్, నిజామాబాద్



ఊళ్లో ఘనంగా జరుపుకొంటాం. చిన్నప్పటి నుంచి అమ్మతో కలిసి పాల్గొంటున్నా. పాటలూ నేర్చుకున్నా. తెలుగు ఉపాధ్యాయుడు ప్రవీణ్‌శర్మ ప్రోత్సాహంతో బతుకమ్మపై కవితలు రాశా. 'పట్టుకుచ్చులు' బాలల కవితా సంపుటిలో ముద్రితమయ్యాయి. బతుకమ్మపై ప్రత్యేక కవితా సంపుటి తెస్తా.



పూలమాల వేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

మహాత్ముడి బాట అనుసరణీయం

నిజామాబాద్ కలెక్టరేట్ : మహాత్మా గాంధీ చూపిన బాట అందరికీ శిరోధార్యమని జిల్లా పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని జిల్లాకేంద్రం గాంధీచౌక్‌లోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. గాంధేయమార్గం ఆదర్శం, అనుసరణీమని పేర్కొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా జడ్జి సునీత కుంచాల పేర్కొన్నారు. సారంగపూర్‌లోని కేంద్ర కారాగారాన్ని బుధవారం సందర్శించారు. గాంధీ జయంతి సందర్భంగా సూపరింటెండెంట్ ఆనంద్‌రావు అధ్యక్షతన ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. అదనపు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వర్‌రావు, నిజామాబాద్ ఆర్డీవో గోపాల్ సింగ్, జైలర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేదికపై జిల్లా జడ్జి సునీత కుంచాల, సూపరింటెండెంట్ ఆనంద్‌రావు, ఆర్డీవో గోపాల్ సింగ్

సర్వేలో జాప్యం.. అక్రమానికి ఊతం

ఈనాడు, నిజామాబాద్

పెద్దరాంమఠం భూముల ఆక్రమణ సర్వే ముందడుగు పడటం లేదు. సర్వే విభాగం సహకారం కొరవడటంతో దేవాదాయశాఖ అధికారులు చతికిలపడ్డారు. నగర శివారులో ఖరీదైన భూములు అన్యాక్రాంతం వ్యవహారం 'ఈనాడు' వరుస కథనాలతో వెలుగులోకి వచ్చింది. ఆలస్యంగా మేల్కొన్న అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లగా ఆక్రమణదారుల నుంచి బెదిరింపులు రావడంతో వెనక్కి తగ్గారు. హద్దులు గుర్తించాల్సి ఉందని.. సర్వే సిబ్బందిని ఇవ్వాలని కలెక్టర్‌ను కలిశారు. ఇందుకు ఆయన అనుమతించి నెలలు గడుస్తోంది. కానీ, ఆ విభాగం అధికారుల నుంచి స్పందన లేదు. కబ్జాదారుల తరఫున ఓ రాజకీయ నేత నుంచి ఒత్తిడి వస్తుండటమే జాప్యానికి కారణమనే ప్రచారం జరుగుతోంది.

ముందుకు కదలని మఠం భూముల వ్యవహారం

వెంటపడుతున్నా వినడం లేదు: 8 నెలల నుంచి దేవాదాయశాఖ సిబ్బంది సర్వేయర్ల వెంట పడుతున్నారు. మొదట న్యాల్‌కల్ రోడ్డులో పరిశీలనకు వెళ్లినప్పుడు మఠం భూముల్లో కొందరు సాగు చేస్తున్నారు. మిగతా భాగంలో నిర్మాణాలు వెలిశాయి. దీంతో హద్దులు గుర్తించి కబ్జాదారులకు నోటీసులివ్వాలని నిర్ణయించారు. భూములు కొలతల శాఖకు లేఖ రాయగా సర్వేయర్‌ను పంపారు. సర్వే చేసి నాలుగు నెలలైనా నివేదిక ఇవ్వలేదు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఎట్టకేలకు కొంత భాగానికి సంబంధించి ఇచ్చి చేతులెత్తేశారు. బోధన్‌లో సర్వే కోసం ఫిబ్రవరిలో లేఖ ఇస్తే ఇప్పటికీ స్పందన లేదు. సారంగపూర్‌లో అత్యధికంగా 88 ఎకరాలు అన్యాక్రాంతమైంది. రెండుసార్లు లేఖ రాసినా పట్టించుకోలేదు.

నేతలతో పైరవీలు : సారంగపూర్ ప్రాంతంలో కొందరి అధీనంలో ఎకరాల కొద్దీ భూములున్నాయి. పరిశీలనకు వెళ్లినప్పుడు నకిలీ లీజు పత్రాలు చూపారు. అవి చెల్లుబాటు కావని అధికారులు తేల్చారు. ఆక్రమణదారుల్లో గుబులు మొదలై తదుపరి చర్యలు లేకుండా పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ హద్దులు గుర్తించకుంటే మఠానికి ఆదాయం రాదు. కబ్జాదారులు ఓ నేతను కలిసి సర్వే జరగకుండా చూడాలని కోరినట్లు ప్రచారం జరుగుతోంది.

మా సమస్యలు బాపూ

జిల్లా కేంద్రం శ్రీనగర్ కాలనీవాసులు ఎమ్మెల్యే, కలెక్టర్‌కు రెండేసి సార్లు, నగర కమిషనర్‌కు 9 సార్లు సమస్యలపై వినతులు ఇచ్చినా బుట్టదాఖలయ్యాయి. గాంధీ జయంతి సందర్భంగా అధికారుల తీరును నిరసిస్తూ బుధవారం దీక్షకు కూర్చున్నారు. కాలనీ రోడ్డు 30 ఫీట్లు ఉందని, రోడ్డుపైనే విద్యుత్తు స్తంభాలు వేశారని, వాస్తవానికి 40 ఫీట్లు ఉన్నా పక్కకు జరపాలని కోరితే నగరపాలక సంస్థ నుంచి లేఖ అడుగుతున్నారని, అక్కడికి వెళ్తే ఇవ్వడం లేదన్నారు. పైగా భూగర్భ మురుగు కాల్వ శుభ్రం చేయడం లేదని, ఇతర సమస్యలకూ పరిష్కారం చూపాలని కోరుతున్నారు. అధికారులు దిగొచ్చే వరకు శాంతియుతంగా ఆందోళన చేపడతామని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం



మత్తును తరిమికొట్టేలా..!

●● బడుల్లో ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటు ●●

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పకడ్బందీగా ముందుకు వెళ్తోంది. డ్రగ్స్ నియంత్రణలో విద్యార్థులను భాగస్వామ్యం చేసేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని గతంలో ఉత్తర్వులు ఇవ్వగా చేపట్టాల్సిన కార్యకలాపాలను ఇటీవల విద్యాశాఖ విడుదల చేసింది.


బోర్గాం(పి) ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఎవరెవరంటే..

ప్రహరీ క్లబ్‌లలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అధ్యక్షుడిగా, సీనియర్ ఉపాధ్యాయుడు ఉపాధ్యక్షులుగా, సభ్యులుగా 6 నుంచి 10వ తరగతి వరకు క్లాస్‌కి ఇద్దరు విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల్లో ఒకరు, స్థానిక ఠాణా నుంచి ఒక కానిస్టేబుల్ సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పాఠశాల, కమ్యూనిటీస్థాయిలో చేయాల్సిన కార్యకలాపాలు వివరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇవి చేయాలి..

మత్తు పదార్థాలతో కలిగే దుష్ఫలితాలు, అవగాహన నినాదాలు, నిర్మూలనకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్లు 18005996969, 1800110031 పాఠశాల గోడలపై రాయాలి. క్లబ్ ప్రతినిధులకు ఈ నంబర్లు కంఠస్థంగా ఉండాలి. ఉపాధ్యాయులు, విద్యార్థులు నివారణపై ప్రతిజ్ఞ చేయాలి. విద్యాసంవత్సరంలో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. నెలవారీగా సమీక్షలు నిర్వహించి, పురోగతిపై చర్చించాలి. ఆల్కహాల్, పొగాకు సంబంధిత ఉత్పత్తులు, నార్కోటిక్ పదార్థాల విక్రయాలు బడి నుంచి 100మీటర్ల వరకు లేకుండా చూడాలి. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు బడులు సందర్శించి లోపాలు సరిచేయాలి. మాదకద్రవ్యాల బానిసత్వం నుంచి బయటపడినవారితో మాట్లాడించాలి. జూన్ 26న మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం, మే 21న పొగాకు వ్యతిరేక దినం నిర్వహించాలి. విద్యార్థులు పక్కదారి పట్టకుండా క్రీడలు, అభిరుచులు, యోగా, మెడిటేషన్ వంటిపై దృష్టి సారించాలి.

కమ్యూనిటీ స్థాయిలో

మాదక ద్రవ్యాల బాధితులను గుర్తిస్తే వివరాలను గోప్యంగా ఉంచి, సరైన చికిత్సనందించాలి. ప్రతి సమావేశానికి తల్లిదండ్రులు హాజరై విద్యార్థుల్లో అసాధారణ ప్రవర్తనలు గుర్తిస్తే కమిటీ దృష్టికి తీసుకెళ్లాలి. విద్యార్థులకు జీవన నైపుణ్యాలు అందించేందుకు తోడ్పాటునివ్వాలి. బాధితులకు కౌన్సెలింగ్ అందించాలి. పోలీసు, ఆరోగ్య, ఎక్సైజ్‌శాఖలతో పాఠశాల విద్యాశాఖ సమన్వయం చేసుకోవాలని, క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలి. ఎన్జీవోలతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

చర్యలు చేపట్టాం

ప్రహరీ కమిటీల కార్యకలాపాలకు సంబంధించిన ఉత్తర్వులు అన్ని పాఠశాలల యాజమాన్యాలకు పంపాం. వాటిని అనుసరించి తగిన చర్యలు చేపట్టాలని సూచించాం. జిల్లా విద్యాశాఖ తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- దుర్గాప్రసాద్, డీఈవో, నిజామాబాద్

జిల్లాలో బడుల వివరాలు..
ప్రాథమికోన్నత : 367
ఉన్నత : 574

పొదుపు మంత్రం పాటిద్దాం

విద్యుత్తు వృథా సరికాదు. రాష్ట్ర ప్రభుత్వం 'గృహజ్యోతి' కింద తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేస్తోంది. ఈ పరిధి దాటకుండా కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వినియోగదారులు జీరో బిల్లు పరిధిలోనే ఉంటారు. పథక లబ్ధిదారులే కాకుండా ఇతరులూ ఈ పొదుపును అలవర్చుకోవాలి. త్వరలో 300 యూనిట్లు దాటే వినియోగదారులకు బిల్లుల మోత మోగే అవకాశం ఉంది. ఈఆర్సీలు కూడా ప్రభుత్వానికి ఈ మేరకు ప్రతిపాదనలు పంపాయి.

● విద్యుత్తు ఛార్జీల భారం తగ్గించుకునే చిట్కాలివే

న్యూస్‌టుడే, కామారెడ్డి సంక్షేమం

ఇలా చేస్తే సరి..

☛ ఇళ్లలో ఫిలమెంట్ బల్బుల బదులు ఎల్ఈడీవి వాడుకోవాలి. ఫిలమెంట్ బుగ్గలు వాడితే 60 వాట్లు, ఎల్ఈడీ బుగ్గలు వాడితే కేవలం 9 వాట్ల విద్యుత్తు మాత్రమే ఖర్చవుతోంది. ☛ గదుల్లో ఎవరూ లేకుంటే ఫ్యాన్లు, బల్బులు బంద్ చేసుకోవాలి. రెగ్యులేటర్ ఉపయోగించుకుంటూ ఫ్యాన్ల వేగం నియంత్రించడంతో పాటు విద్యుత్తును పొదుపు చేసుకోవచ్చు. ☛ టీవీలను రిమోట్‌తో ఆఫ్ చేస్తారు. వీటికి విద్యుత్తు సరఫరా చేస్తున్న స్విచ్‌ను మాత్రం వదిలివేస్తారు. అలా చేయకూడదు.

☛ గృహాల్లో ఐఎస్ఐ గుర్తింపు కలిగిన స్టార్ రేటెడ్ విద్యుత్తు ఉపకరణాలు వాడాలి.

☛ ఇళ్లలో వాటర్ హీటర్లు, ఎలక్ట్రిక్ పొయ్యిలు, రైస్‌కుక్కర్లు వినియోగిస్తున్నారు. తక్కువ నాణ్యత కలిగిన ఈ ఉపకరణాల వల్ల అధికంగా విద్యుత్తు బిల్లులు వచ్చే అవకాశం ఉంది. వీటి వినియోగం తగ్గించుకోవడం ద్వారా విద్యుత్తు ఆదా చేసుకోవచ్చు. ☛ గ్రైండర్ వినియోగిస్తున్నప్పుడు నైలాన్ బెల్టును ఉపయోగించుకుంటే మంచిది. దీంతో యంత్రం మన్నికగా ఉండడంతో పాటు తక్కువ విద్యుత్తును తీసుకుంటుంది.

☛ ఫ్రిడ్జ్‌లను గాలి, వెలుతురు ఎక్కువగా వచ్చే చోటనే ఉంచాలి. పదేపదే ఫ్రిడ్జ్ తలుపులు తెరవడంతో విద్యుత్తు అధికంగా ఖర్చవుతుంది.

ఉపకరణాలు కొనుగోలు చేయొచ్చు

- రమేశ్‌బాబు, ఎస్ఈ, ఎన్‌పీడీసీఎల్, కామారెడ్డి సర్కిల్



కేంద్ర విద్యుత్తు మంత్రిత్వశాఖ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) భాగస్వామ్యంతో తక్కువ విద్యుత్తు ఉపయోగించుకునే నాణ్యమైన ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్లు, ఇండక్షన్‌స్టవ్‌లు, 5స్టార్ బీఎల్‌డీసీ ఫ్యాన్లు, సూపర్ ఎఫిషియంట్ ఏసీలు, ఎఈడీ ఇన్వర్టర్ బల్బులను తక్కువ ధరలకే అందిస్తున్నాయి. వినియోగదారులు www. tgnpdcl.com వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ వారి హోం పేజీకి వెళితే అందులోని విద్యుత్తు ఉపకరణాలను కొనుగోలు చేయవచ్చు. పేజీలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఆర్డర్ చేసుకోవాలి. ఈ విద్యుత్తు ఉపకరణాలు మన్నికగా ఉండడంతో పాటు విద్యుత్తు బిల్లుల భారాన్ని తగ్గిస్తాయి.

నాణ్యమైనవి వాడుకుంటే మంచిది

- లక్ష్మణ్, ఏఈ కామారెడ్డి

ఏసీలు వాడడంతో బిల్లులు అధికంగా వస్తుంటాయి. 1.5 టన్నుల సామర్థ్యం కలిగిన ఏసీలను వినియోగిస్తే గంటకు 2 యూనిట్ల విద్యుత్తు ఖర్చవుతుంది. మంచి కంపెనీలకు చెందిన 5 స్టార్ రేటింగ్ కలిగిన ఏసీల వినియోగంతో కొంత మేరకు విద్యుత్తు ఆదా జరుగుతుంది. ఏసీలు ఆన్ చేసినప్పుడు కిటికీలు, తలుపులు మూసి 10 నిమిషాల పాటు ఫ్యాన్ వేసుకుంటే గది ఉష్ణోగ్రత త్వరగా చల్లబడుతుంది. తర్వాత ఫ్యాన్ బంద్ చేసుకోవాలి. ఏసీలను ఎల్లప్పుడు 25 డిగ్రీల ఉష్ణోగ్రతతో వినియోగించుకుంటే మంచిది.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బుధవారం కోమటిపల్లి మైదానంలో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 49.3 ఓవర్లలో 192 పరుగులు చేసింది. ఛేదనలో నిజామాబాద్ జట్టు 30 ఓవర్లలో 74 పరుగులకే కుప్పకూలింది. 118 పరుగుల భారీ తేడాతో కరీంనగర్ జట్టు విజయం సాధించింది. మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఆదిలాబాద్‌పై ఖమ్మం జట్టు గెలుపొందింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిలాబాద్ జట్టు 29.3 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 109 పరుగులు చేసింది. ఖమ్మం జట్టు 30.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. గురువారం కోమటిపల్లి మైదానంలో ఖమ్మం, నిజామాబాద్: మొగిలిచర్ల మైదానంలో ఆదిలాబాద్, కరీంనగర్ జట్ల మధ్య మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.


గెలుపొందిన ఖమ్మం జట్టు

జల శుద్ధి.. పర్యాటక వృద్ధి

● చెరువులను కాలుష్య రహితంగా మార్చేందుకు స్వచ్ఛంద సంస్థ ఆసక్తి

న్యూస్‌టుడే, ఆర్మూర్

హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌ను తలపించేలా చుట్టూ రోడ్డు ఉంటుంది. విద్యుద్దీపాలు, కాలక్షేపం కోసం సిమెంటు కుర్చీలు, అందరినీ ఆకట్టుకునేలా అలంకరణ చెట్లున్నాయి. చుట్టూ నివాస ప్రాంతాలున్నప్పటికీ మనిషి కొంత సమయం కూడా నిలబడలేరు. ఎందుకంటే గుట్ట ప్రాంతం నుంచి వచ్చే వరద, నివాసాల్లో నుంచి మురుగు అంతా ఇక్కడే చేరుతుంది. ఇది చాలదన్నట్లు మాంస వ్యర్థాలు, పశువుల కళేబరాలు ఇక్కడే పడేస్తారు. ఇదీ ఆర్మూర్ బల్దియాలోని మల్లారెడ్డి చెరువు (మల్లెల చెరువు) దుస్థితి. ఇలాంటి చెరువును ఇప్పుడు పర్యావరణ హిత ప్రాంతంగా మార్చబోతున్నారు. బల్దియాలోని గూండ్ల, పెర్కిట్ చెరువులను కలుపుకొని ప్రకృతి ఆధారితంగా, కాలుష్య రహిత ప్రాంతంగా మార్చేందుకు ఓ స్వచ్ఛంధ సంస్థ ముందుకొచ్చింది.


మల్లారెడ్డి చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు

ప్రాణాంతక రసాయనాల గుర్తింపు..

పర్యావరణ మార్పులకు పరిష్కారాలు చూపిస్తూ.. జనావాసాల్లో ఉండే నీటి వనరులను సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నాణ్యంగా మార్చేందుకు దిల్లీలోని ఫిస్టులిఫెరా సోలారిస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్వచ్ఛంధ సంస్థ శ్రీకారం చుట్టింది. సెప్టెంబరు 22న ఆర్మూర్ ప్రాంతంలోని మల్లారెడ్డి, పెర్కిట్, గూండ్ల చెరువులను పరిశీలించి నీటి నమూనాలు సేకరించారు. ఇందులో ప్రమాదకరమైన టాక్సిక్ ఆల్గల్ బ్లూమ్ నిల్వ ఉందని.. నీటి నాణ్యత దెబ్బతిందని గుర్తించింది. ఇలాంటి రసాయనాల నీటితో చేపలు మృతి చెందుతాయని, మనుషులు, పశువులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వెల్లడించింది.

నయా పైసా ఖర్చు లేకుండా

స్వచ్ఛంధ సంస్థ నీటి నాణ్యతను పెంచుతామని, ఆరోగ్యమైన చేపల ఉత్పత్తికి దోహదపడే జీవావరణాన్ని పునరుద్ధరిస్తామని భరోసా ఇచ్చింది. ఇందుకు ప్రభుత్వాల నుంచి ఎలాంటి నిధులు వినియోగించమని.. పూర్తి సేవా దృక్పథంతో పనిచేస్తామని ప్రకటించింది. ఇందుకు సంబంధించి బల్దియా కమిషనర్‌కు లేఖ రాసింది. అనుమతులిస్తే రంగంలోకి దిగుతామని వెల్లడించింది.


పాలకవర్గం అనుమతితో సహకరిస్తాం

- రాజు, బల్దియా కమిషనర్, ఆర్మూర్



చెరువుల గతి మార్చేందుకు ముందుకొచ్చిన స్వచ్ఛంద సంస్థ పనితీరును పరిశీలిస్తున్నాం. పాలకవర్గం అనుమతితో సదరు సంస్థను స్వాగతిస్తాం. కాలుష్య రహితంగా మార్చేందుకు ఎలాంటి నిధుల భాగస్వామ్యం లేకుండా ముందుకొచ్చారు. రానున్న రోజుల్లో చెరువుల్లో స్వచ్ఛమైన నీటిని చూస్తామని ఆశిస్తున్నాం. ఇందుకు పూర్తిగా సహకరిస్తాం.

స్వచ్ఛ ప్రదర్శన



గాంధీ జయంతి సందర్భంగా నిజామాబాద్ నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులు బుధవారం పాత కలెక్టరేట్ క్రీడా మైదానంలో వినూత్న ప్రదర్శన చేపట్టారు.



'స్వచ్ఛతా హీ సేవా' ముగింపు వేడుకల్లో భాగంగా జాతీయ జెండాలు చేతబట్టి ఎస్‌హెచ్ఎస్-2024 ఆకారంలో నిలబడి ప్రదర్శన ఇచ్చారు. ఇందూరును స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని మానవహారం చేపట్టారు. – ఈనాడు, నిజామాబాద్

రోడ్డుపై నిప్పు.. వాహనదారులకు ముప్పు

రైతులు పండించిన మొక్కజొన్న పంటను నూర్పిడి చేశాక వచ్చిన పొట్టును రోడ్డుపై వదిలేసి వెళ్తున్నారు. మరికొందరు దానిని కాలుస్తున్నారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పొగతో ద్విచక్రవాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. భీమ్‌గల్ శివారులో రోడ్డుపై కాలుస్తుండగా 'ఈనాడు' తీసిన చిత్రమిది. – ఈనాడు, నిజామాబాద్



పక్కనే కుంట.. అదుపు తప్పితే తంట



ఈ కుంట సీఎంసీ నుంచి దేవనగర్ వెళ్లే రోడ్డును ఆనుకొని ప్రమాదకరంగా ఉంది. సుద్దపల్లి, సాంపల్లి, యానంపల్లి, సుద్దులం, కోరట్‌పల్లి, ధర్పల్లి, రామడుగు ప్రజలతో పాటు తెలంగాణ వర్సిటీకి వచ్చే ఉద్యోగులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తారు. ఇక్కడ వాహనాలు ఏ మాత్రం అదుపు తప్పినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. గతంలో జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనం అదుపుతప్పి కుంటలో పడి మృతిచెందారు. అయినా అధికారులు స్పందించలేదు. ఇప్పటికైనా ఇక్కడ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, డిచ్‌పల్లి

బోధన్‌లో వేడుకలు ప్రత్యేకం

◆ నేడు సద్దుల బతుకమ్మ

న్యూస్‌టుడే, బోధన్ పట్టణం

బోధన్ పట్టణంలో గురువారం నిర్వహించే సద్దుల బతుకమ్మ సంబరాలకు మహిళలు సిద్ధమవుతున్నారు. అంతటా అమావాస్య రోజు నుంచి బతుకమ్మ సంబరాలు మొదలైతే... ఇక్కడ నవరాత్రి ఉత్సవాల ప్రారంభమయ్యే తొలి రోజు ముగుస్తాయి. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ. పొలాల అమావాస్య రోజు నుంచి పెద్దల అమావాస్య వరకు సంబరాలు మొదలవుతాయి. పశువుల పేడ పిడకలపై పూలు పేర్చి పిల్లలు కలిసి ఆడతారు. కాలక్రమంలో నెలరోజుల ఉత్సవం కనుమరుగై... సద్దుల బతుకమ్మకు మూడు రోజుల ముందు అట్ల బతుకమ్మ మాత్రమే ఆడుతున్నారు. కొద్ది మంది మాత్రం ముద్దపప్పు బతుకమ్మ ఆడతారు. అమావాస్య మరుసటి రోజు సద్దుల బతుకమ్మతో సంబరాలు ముగుస్తాయి. పట్టణంలో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. దసరా నాటికి జాతర ఉంటుంది. ఈ నేపథ్యంలో బోధన్ ప్రాంత ప్రజలు ఉత్సవాల్లో భాగస్వాములవ్వాలనే ఉద్దేశంతో బతుకమ్మ సంబరాలను ముందస్తుగానే నిర్వహిస్తారన్న వాదన ఉంది. సద్దుల బతుకమ్మ ముందుగా నిర్వహించడంతో ఇక్కడి కుటుంబాలకు బంధువుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.


బతుకమ్మ సంబరాల్లో మహిళలు, యువతులు

క్రీడాకారులకు బెల్టు పరీక్ష

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వినాయక్‌నగర్‌లోని క్యూరియస్ తైక్వాండో అకాడమీలో బుధవారం బెల్టుపరీక్షలు నిర్వహించారు. 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా జిల్లా మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి హాజరై క్రీడాకారులను అభినందించారు. శిక్షకుడు వినోద్‌నాయక్, గిరిజన శక్తి జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, సాయి, ప్రసాద్, కిషోర్ పాల్గొన్నారు.



క్రీడాకారులతో తైక్వాండో శిక్షకుడు వినోద్ నాయక్ తదితరులు

కస్తూర్బాలో ఏం జరుగుతోంది..?

న్యూస్‌టుడే, మాక్లూర్

మాక్లూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కొన్ని రోజులుగా వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. ప్రత్యేక అధికారిణి, సిబ్బందికి మధ్య వివాదం నెలకొందని తెలిసింది. 15 ఏళ్ల కిందట నిర్మించిన కేజీబీవీ భవనానికి ప్రహరీ సైతం లేదు. ప్రస్తుతం 200 మంది ఇంటర్, 210 మంది పాఠశాల విద్యార్థినులు ఉన్నారు. భవనాలు అటవీప్రాంతంలో ఉండడం, రాత్రివేళల్లో యువకులు చొరబడుతున్నట్లు విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు.

ఫిర్యాదుల పెట్టెలో సమస్యలు..

రెండు నెలల క్రితం కొత్తగా విధుల్లో చేరిన ప్రత్యేక అధికారిణి అనురాధ ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటుచేయగా.. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అనురాధకు, కొంతమంది సిబ్బందికి మధ్య విభేదాలు తలెత్తాయి. అధికారిణిని తమను వేధిస్తుందంటూ సిబ్బంది ఇటీవల డీఈవోకు ఫిర్యాదుచేశారు. నాలుగు రోజుల కిందట జీసీడీవో భాగ్యలత కేజీబీవీకి వచ్చి విచారణ జరిపి నివేదికను డీఈవోకు అందజేశారు.

ఎవరికీ చెప్పుకోలేని దుస్థితి

- అనురాధ, ప్రత్యేక అధికారిణి

కేజీబీవీలో చోటు చేసుకుంటున్న వ్యవహారాలను ఎవరితోనూ చెప్పుకోలేక పోతున్నా.. విద్యార్థినులు ఫిర్యాదు పెట్టెలో గోడు వెళ్లబోసుకున్నారు. కొంత మంది సిబ్బంది ఆగడాలను అరికడుతున్నందుకు నాపై అధికారులకు ఫిర్యాదు చేశారు.


ప్రహరీ లేని మాక్లూర్ కస్తూర్బా విద్యాలయం

అధికారిణికి శ్రీముఖం జారీ

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: మాక్లూర్ కేజీబీవీలో తలెత్తిన వివాదంపై వివరణ ఇవ్వాలని ప్రత్యేకాధికారిణికి బుధవారం శ్రీముఖం జారీ చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. పూర్తిస్థాయి నివేదిక వచ్చాక కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్య అవసరం

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నేటి తరంలో బట్టీ చదువుల పరంపర కొనసాగుతోందని, ఆటపాటలు, అనుభవపూర్వక విద్య రావాల్సిన అవసరముందని బాలోత్సవ రిసెప్షన్ కమిటీ చీఫ్ పాటర్న్ జయనీ నెహ్రూ అన్నారు. నగరంలోని మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవనంలో బుధవారం ఆమె ఉపాధ్యాయుల శిక్షణను ప్రారంభించి ప్రసంగించారు. ఈ నెల 8, 9వ తేదీల్లో మోపాల్ మండలంలోని ప్రెసిడెన్సీ పాఠశాలలో బాలోత్సవం నిర్వహించి ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. లో కాస్ట్-నో కాస్ట్ బోధనోపకరణాలతో చదువు నేర్పేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నర్ర రామారావు అన్నారు. మూడు వేల మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొంటారని కమిటీ కోశాధికారి రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. ఆర్పీలు చంద్రయ్య, నరసింహులు, గగన్‌కుమార్, విజయానందరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జయనీ నెహ్రూ

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

సన్నాహక సమావేశం

బోధన్ పట్టణం, నవీపేట, కోటగిరి, న్యూస్‌టుడే: పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఈ నెల 4న జిల్లాకు రానున్న సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలపై బోధన్, నవీపేటలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. కోటగిరి, వర్నిలో ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ పర్యటించి నాయకులతో సమావేశమయ్యారు.


నవీపేట: మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయమని జిల్లా జడ్జి కుంచాల సునీత అన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా రెడ్‌క్రాస్‌లోని తలసేమియా వార్డును సందర్శించి చికిత్స పొందుతున్న చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ బుస్స ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, నరాల సుధాకర్, డా.నీలి రాంచందర్, డా. శ్రీశైలం, పీఆర్వో బొద్దుల రామకృష్ణ పాల్గొన్నారు.


చిన్నారులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి కుంచాల సునీత


కలెక్టరేట్‌లో..


టీపీఆర్టీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో..



సీపీ కార్యాలయంలో


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్


జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో..

మహాత్ముడి బాటలో పయనిద్దాం...

జిల్లా వ్యాప్తంగా బుధవారం మహాత్మా గాంధీ జయంతి నిర్వహించారు. దేశానికి చేసిన సేవలు కొనియాడి చిత్రపటానికి నివాళులర్పించారు. మహాత్ముడి బాటలో నడవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, బృందం


హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యార్థులు


తెవివిలో..


వర్నిలో..


నవీపేటలో..


డిచ్‌పల్లిలో..


ధర్పల్లిలో.. తాహెర్ బిన్ హందాన్ తదితరులు


నిజామాబాద్ గ్రామీణం: ఖానాపూర్‌లో..


కాంగ్రెస్ భవన్‌లో...


తెదేపా కార్యాలయంలో..


సాలూరలో..


బోధన్‌లో..పుర, ఏఎంసీ ఛైర్‌పర్సన్లు పద్మ, సంధ్య తదితరులు


కోటగిరిలో.. ఆగ్రోస్ ఛైర్మన్ బాల్‌రాజ్ తదితరులు

డిజిటల్ ఆరోగ్య కార్డుల సర్వే

● నేటి నుంచి ప్రారంభం ● నియోజకవర్గానికి ఒక గ్రామం, పట్టణాల్లో వార్డు ఎంపిక

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

కుటుంబ డిజిటల్ ఆరోగ్య స్మార్ట్ కార్డు రూపకల్పనకు ప్రభుత్వం నిర్ణయించింది. ముందుగా ప్రతి కుటుంబ సభ్యుడి వివరాలు సేకరించనుంది. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామంతో పాటు, నిజామాబాద్ అర్బన్‌లో మూడు డివిజన్లు, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ పట్టణాల్లో ఒక్కో వార్డు ఎంపికయ్యాయి. ఎంపీడీవో, తహసీల్దార్ నేతృత్వంలో రెండు బృందాలను నియమించారు. ఒక్కోదాంట్లో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉంటారు. వారు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తారు. గురువారం సర్వే ప్రారంభించి 7వ తేదీ నాటికి పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నిజామాబాద్ నగరంలో డిప్యూటీ కమిషనర్, అడిషనల్ కమిషనర్ బృందాలకు నాయకత్వం వహిస్తారు. ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా ఐఏఎస్ అధికారి శరత్‌ను నియమించారు.

ఎక్కడెక్కడంటే?

మండలం	: గ్రామం
డిచ్‌పల్లి	: సాంపల్లి
బాల్కొండ	: శ్రీరాంపూర్
ఆర్మూర్	: రాంపూర్
బోధన్	: లంగ్డాపూర్
మున్సిపాలిటీ	: వార్డు సంఖ్య
ఆర్మూర్ పట్టణం	: 2
బోధన్ పట్టణం	: 25
భీమ్‌గల్ పట్టణం	: 7
నిజామాబాద్ నగరం	: 3, 38, 45

పొరపాట్లకు తావివ్వొద్దు

- శ్రీనివాస్, ఇన్‌ఛార్జి డీపీవో

ప్రభుత్వం ప్రయోగాత్మకంగా సర్వే చేపడుతోంది. ఇప్పటికే సిబ్బందికి సర్వేపై అవగాహన కల్పించాం. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా వివరాలు సేకరించాలి.


నడిపల్లిలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌ఛార్జి డీపీవో శ్రీనివాస్‌రావు

గ్రామసభలో వాగ్వాదం

ఎడపల్లి, న్యూస్‌టుడే: కుర్నాపల్లిలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో వాగ్వాదం చోటుచేసుకుంది. కారోబార్ పాండుపై కొందరు ఉద్దేశపూర్వకంగా డీపీవోకు ఫిర్యాదు చేసి తొలగించారని, ఆయన్ని విధుల్లోకి తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సురేష్‌ను నిలదీశారు. ఈ విషయమై గ్రామస్థులు డీపీవోతో చరవాణిలో మాట్లాడారు.. తీర్మానం చేస్తే విధుల్లోకి తీసుకుంటామన్నారు. గ్రామస్థులు పట్టుబట్టడంతో ఎట్టకేలకు తీర్మానం చేశారు.

అనుమతులు లేకుండా డీజేలు పెట్టొద్దు

జక్రాన్‌పల్లి, మోపాల్, న్యూస్‌టుడే: సీపీ ఆదేశాల మేరకు ఊరేగింపులు, డీజేలపై నిషేధం విధించినట్లు మోపాల్ మండల ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. డీజే నిర్వాహకులు లైసెన్సు కలిగి ఉండాలని, కార్యక్రమ నిర్వాహకులు కచ్చితంగా ఏసీపీ అనుమతి తీసుకోవాలని అందులో పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారిశుద్ధ్య కార్మికులకు ప్రశంసా పత్రాలు

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన నగరపాలక సంస్థ కార్మికులను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అభినందించారు. బుధవారం నగరపాలక సంస్థ మేయర్ నీతూకిరణ్, కమిషనర్ మకరందుతో కలిసి ప్రశంసా పత్రాలు అందజేశారు.



మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048



పరిష్కారం: దుబ్బ శ్మశానవాటిక ఎదురుగా కృష్ణ మందిరం వైపు వెళ్లే రోడ్డులో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పారేస్తున్నారని శ్రీనివాస్ 'న్యూస్‌టుడే'కు విన్నవించగా.. అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి వ్యర్థాలను డంపింగ్‌యార్డుకు తరలించారు.

ఈనాడు కథనానికి స్పందన



పరిష్కారం: బోధన్ చెక్కి-క్యాంపులో డ్రైనేజీ పక్కన మొక్కలు పెరిగి, మురుగునీరు పారడంపై స్థానికుడు సంతోష్ ఈనాడు దృష్టికి తేగా శానిటరీ జవాన్ గాబ్రియెల్ స్పందించి సమస్య పరిష్కరించారు.



పరిష్కారం: గ్రామంలోని పలు వార్డుల్లో బోరు మోటార్లు చెడిపోవడంతో గ్రామస్థులు ఈనాడు దృష్టికి తేగా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ స్పందించి రూ.10వేల సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించారు.

●● **సమస్య:** ధర్పల్లి రహదారి వెంట పలువురు వ్యాపారులు రోడ్డు వరకు ఆక్రమించి, చిరు వ్యాపారులకు అద్దెకిస్తున్నారు. ట్రాఫిక్ సమస్య నెలకొంది. **- ప్రయాణికుడు, ఇందల్‌వాయి**

సమాధానం: ఇదివరకే నోటీసులిచ్చి తొలగించాం. మరోసారి నోటీసులు ఇస్తాం. **- శ్రీధర్, కార్యదర్శి, తిర్మన్‌పల్లి**

– న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం, ఇందల్‌వాయి, ఎడపల్లి, బోధన్ పట్టణం

లాల్‌బహదూర్ శాస్త్రీ సేవలు మరువలేనివి

జిల్లా వ్యాప్తంగా బుధవారం లాల్‌బహదూర్ శాస్త్రీ జయంతి నిర్వహించారు. ఆయన సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు.

– న్యూస్‌టుడే, బృందం


నిజామాబాద్‌లో.. నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు


అదనపు పాలనాధికారి అంకిత్


నిజామాబాద్: బీసీటీయూ ఆధ్వర్యంలో..


బోధన్‌లో..


రెంజల్‌లో..

స్వచ్ఛతా హీ సేవ

న్యూస్‌టుడే, బృందం: బోధన్, రుద్రూర్, కోటగిరి తదితర ప్రాంతాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలు శుభ్రం చేశారు.


కోటగిరి: రుద్రూర్ ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాల ఆవరణలో చెత్త తొలగిస్తున్న విద్యార్థులు


డిచ్‌పల్లిలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా శిక్షణ అభ్యర్థులు, ఎస్‌బీఐ శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్

బతుకమ్మ సంబురాలు

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా మహాలయ అమావాస్య సందర్భంగా బుధవారం బతుకమ్మ సంబరాలను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. గునుగ, తంగెడు, బంతి, చామంతి వంటి పూలతో పేర్చి పసుపు గౌరమ్మను పూజించారు. మొదటి రోజు ఎంగిలి పూలబతుకమ్మను కొలిచారు. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ కీర్తించారు. పాటలు పాడుతూ.. ఆటలు ఆడారు. సమీపంలోని వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.


కిషన్‌గంజ్ వాసవీమాత ఆలయ ప్రాంగణంలో...


రోటరీనగర్‌లో..

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: నారాయణ్‌పేట్ జిల్లాలో గురువారం నుంచి ప్రారంభమయ్యే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఖరారైందని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి తెలిపారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బుధవారం క్రీడాకారులు వెళ్లారని, మూడు రోజుల పాటు జరిగే పోరులో విజేతలుగా తిరిగిరావాలని ఆకాంక్షించారు. పీఈటీలు అనురాధ, మీసాల ప్రశాంత్, అజ్మత్ పాల్గొన్నారు.


క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి, పీఈటీలు అనురాధ, ప్రశాంత్



శాకాహార ర్యాలీ

బోధన్ పట్టణం: పట్టణంలోని పత్రీజీ జన్మస్థల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం శాకాహార ర్యాలీ నిర్వహించారు. గాంధీ జయంతి సందర్భంగా శక్కర్‌నగర్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ప్లకార్డులు, నినాదాలతో ఊరేగింపు చేపట్టారు. ట్రస్టు ప్రతినిధులు గంగారెడ్డి, నీలిమ, లత తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డు ప్రారంభం

ఎడపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో రూ.50లక్షలతో నిర్మించిన మోడ్రన్ డంపింగ్ యార్డును అదనపు కలెక్టర్ అంకిత్ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలోని 25 గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వెంట పంచాయతీ అధికారులు ఉన్నారు.


యంత్రం పనితీరు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్



ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు

ఎడపల్లి, న్యూస్‌టుడే: సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు బుధవారంతో ముగిశాయి. బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు వెంకటేశ్వర శర్మ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సిరికొండ, న్యూస్‌టుడే: మండలంలోని కొండాపూర్ నూతన గ్రామాభివృద్ధి కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా పొడెడ్ల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా నర్సయ్య, సభ్యులుగా నర్సాగౌడ్, మహమ్మద్ అసిఫ్ హుస్సేన్, బాలసాయిలు, సుభాష్, రాజు, సుమన్, గంగాధర్‌లతో ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

బోధన్ పట్టణం, న్యూస్‌టుడే: బోధన్‌లో లయన్స్ క్లబ్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో బుధవారం సీనియర్ సిటిజన్స్ డే నిర్వహించారు. శ్రీ విజయసాయి పాఠశాలలో చెరకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సామాజిక కార్యకర్త గుర్రాల సరోజనమ్మను సన్మానించారు. ప్రతినిధులు రామకృష్ణారావు, గణపతిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధిహామీపై గ్రామసభ

రెంజల్, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పనుల్లో పంట కాల్వలకు ప్రాధాన్యత ఇస్తామని, రైతులు పూడికతీతకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వెంకటేష్‌జాదవ్, ఏపీవో వెంకటరమణ సూచించారు. రెంజల్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శి రాజేందర్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు.

వరద బాధితులకు విరాళం

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: వరద బాధితులకు జానకంపేట్ ఇమేజ్ సైకిల్ విద్యార్థులు ఆర్థికసాయం అందించారు. రూ.16,116 చెక్కును కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు బుధవారం పాఠశాల నిర్వాహకులు అందజేశారు.

ఈనాడు సినిమాలు

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏసియన్)
స్క్రీన్–1: దేవర పార్ట్-I : 12.55, 4.20, 7.20, 10.30(రాత్రి)
స్క్రీన్–2: దేవర పార్ట్-I 10.30
సత్యం సుందరం 10.00(రాత్రి)
స్క్రీన్–3: సత్యం సుందరం: 1.30, 4.30, 7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)
స్క్రీన్–1: దేవర పార్ట్-I : 11.15, 2.50, 6.25, 10.00 (రాత్రి)
స్కీన్–2: తంబ్బ్యాడ్ (హిందీ) 1.35
మత్తు వదలరా-2 4.15,
దేవర పార్ట్-I 7.10, స్త్రీట్-2 (హిందీ) 10.50(రాత్రి)
స్క్రీన్–3: జోకర్ ఫోలీ ఏ డిలక్స్ (ఇంగ్లిషు) 11.30, 2.45, 6.00, 9.45 (రాత్రి)
స్క్రీన్–4: మత్తు వదలరా-2 12.40
చిట్టి పొట్టి 3.40 సత్యం సుందరం: 6.40, 10.00(రాత్రి)

దేవి (ఎస్వీసీ): సత్యం సుందరం 11.15, 2.15, 6.15, 9.15(రాత్రి)
నటరాజ్(గీతా ఏసియన్): దేవర పార్ట్-I (హిందీ) 11.00, 2.30, 6.00, 9.30(రాత్రి)
లలితామహల్(ఎస్వీసీ): దేవర పార్ట్-I 10.45, 2.15, 6.00, 9.30(రాత్రి)
విజయ్(ఎస్వీసీ): దేవర పార్ట్-I 10.50, 2.15, 6.00, 9.30(రాత్రి)

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

సభ్యత్వ నమోదు

చందూర్, న్యూస్‌టుడే: చందూర్‌లో భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బుధవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

క్రైమ్ కార్నర్

రైలులో ఆత్మహత్య

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆగి ఉన్న రైలులో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బోధన్ రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న గుంతకల్ ప్యాసింజర్ రైలులో 55 ఏళ్ల వ్యక్తి టవల్‌తో ఉరేసుకున్నారు. గమనించిన మేనేజర్ నవీన్‌కుమార్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు ఆరా తీశారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే స్టేషన్ ఎస్సై సాయిరెడ్డి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

నిజామాబాద్ నేరవిభాగం: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఐదో ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై గంగాధర్ కథనం ప్రకారం.. నగరంలోని ఇంద్రాపూర్‌కు చెందిన సురేశ్(45)కు ప్లంబింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో పిల్లలను పోషించడం కష్టమై భార్య, పిల్లలతో గౌతమ్‌నగర్‌కు మకాం మార్చాడు. మంగళవారం ఉదయం పని ఉందని ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భార్య చరవాణిలో సంప్రదించినా సమాధానం ఇవ్వలేదు. ఇంద్రాపూర్‌లోని సురేశ్ సొంత ఇంటి తలుపులు తెరిచినట్లు గమనించిన చుట్టుపక్కవారు బుధవారం ఉదయం వెళ్లి చూడగా ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని బాలిక బలవన్మరణం

నిజామాబాద్ నేరవిభాగం: రెండో ఠాణా పరిధిలో ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ఓ బాలికను పదే పదే బయట తిరగొద్దని తల్లి మందలించినందుకు క్షణికావేశంతో మూడు రోజుల కిందట ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. తల్లి హుటాహుటిన బాలికను జిల్లా జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం తిరిగి ఇంటికి తీసుకురాగా.. మంగళవారం రాత్రి పరిస్థితి విషమించింది. మళ్లీ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

గోదావరిలో దూకి...

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: నవీపేట మండల కేంద్రానికి చెందిన దత్తు (45) బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. దత్తు కూలి పని చేస్తుంటాడు. ఆరు నెలల కిందట ఆయన యాసిడ్ తాగాడు. చికిత్స చేయించినా నయం కాలేదు. జీవితంపై విరక్తి చెంది 15 రోజుల క్రితం ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. బుధవారం మధ్యాహ్నం గోదావరిలో స్నానం చేస్తున్న భక్తులకు మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న ఎస్సై మృతదేహాన్ని బయటకు తీయించారు.

చికిత్స పొందుతూ మృతి

నిజామాబాద్ నేరవిభాగం: పురుగుల మందు తాగి మహిళ చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన నాలుగో ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. నగరంలోని పద్మానగర్ రోడ్డు-1లో నివాసముంటున్న లలిత(53) అనారోగ్య సమస్యలతో సెప్టెంబరు 27న పురుగుల మందు తాగారు. కుటుంబీకులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా బుధవారం మృతి చెందారు. మృతురాలి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

గంజాయి విక్రయదారుల అరెస్టు

నిజామాబాద్ నేరవిభాగం : రెండో ఠాణా పరిధిలో గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై యాసిర్ అరాఫత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నగరంలోని బర్కత్‌పుర కాలనీకి చెందిన అఫ్రోజ్, మునీఫ్‌ఖాన్ నాందేడ్‌కు చెందిన కరీం వద్ద గంజాయి కొనుగోలు చేస్తారు. వాటిని చిన్న చిన్న పొట్లాలుగా చేసి నగరంలో విక్రయిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. కొద్ది రోజుల నుంచి వీరిపై నిఘా ఉంచి బుధవారం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి 100 గ్రా.ల ఎండు గంజాయి, 3 చరవాణులు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు.

డబ్బులు స్వాహా చేసిన నిందితులు..

బీబీపేట : తుజాల్‌పూర్, ఇస్సానగర్ గ్రామాలకు సంబంధించిన పింఛన్ల డబ్బులు రూ.10 లక్షలను సస్పెన్షన్‌లో ఉన్న తుజాల్‌పూర్ గ్రామ తపాలశాఖ బీపీఎం భిక్య, అతడి స్నేహితుడు సురేశ్ సోమవారం స్వాహా చేశారు. వీరిపై బీబీపేట ఠాణాలో మంగళవారం కేసు నమోదైంది. కోటగిరి మండలం సుద్దులతాండ గ్రామానికి చెందిన భిక్య, సురేశ్‌ను బుధవారం పట్టుకుని అరెస్టు చేసి, వారి నుంచి రూ.10 లక్షలు రికవరీ చేసినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

ఆర్మూర్

● ఆర్మూర్ ● బాల్కొండ

జవానుకు సన్మానం



నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఇండియన్ ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ పొందిన నన్నం హన్మంతును బుధవారం చిరాజ్‌పల్లి గ్రామస్థులు సన్మానించారు. 2011 నుంచి 2024 వరకు దేశ రక్షణలో భాగమై తమ గ్రామానికి వన్నె తెచ్చారని ప్రశంసించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి తోట గణేశ్, రాజు, చిన్నరాజేశ్, ఉప్పరి గంగాధర్, భోజారెడ్డి, నన్నం సదానంద్ పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



నందిపేట్, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. సంజీవ్‌రాజ్, వొరక దేవన్న, హరిదాస్, బాబురావు తదితరులు ఉన్నారు.

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్) ఈనాడు సినిమాలు

స్క్రీన్ 1 **జోకర్ ఫోలీ ఎ డెక్స్:** 10.00, 1.15, 7.30, 10.45 **చిట్టి పొట్టి:** 4.30
స్క్రీన్ 2 **దేవర(పార్ట్-I):** 11.00, 2.35, 6.10, 9.45
స్క్రీన్ 3 **దేవర(పార్ట్-I) :** 11.45, 3.20, 6.55, 10.30
స్క్రీన్ 4 **సత్యం సుందరం:** 12.20, 6.40, 10.00 **మత్తు వదలరా2:** 3.40

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా..

94939 26837
98666 11160

ఏర్గట్ల, న్యూస్‌టుడే: నాగేంద్రనగర్ నుంచి గుమ్మిర్యాల్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై మురుగు పారుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు సమస్య మరీ ఇబ్బందికరంగా మారింది. **- శంకర్, గుమ్మిర్యాల్**

సమాధానం: సమస్య మా దృష్టికి వచ్చింది. మురుగుకాలువ లేకపోవడంతో నీరు రహదారిపైకి వచ్చింది. తాత్కాలిక ఏర్పాట్లు చేసి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం. **- రామకృష్ణ, పంచాయితీ కార్యదర్శి**

భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ముచ్కూర్‌లోని సాలంపూర్ గుడి దగ్గర వర్షపు నీరు నిలిచి దోమలు ఎక్కువ అవుతున్నాయి. తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలి. **-స్థానికుడు**

సమాధానం: వెంటనే నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం. **-సతీష్, పంచాయతీ కార్యదర్శి**

మాక్లూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ముత్యంపల్లి వద్ద ఆర్‌అండ్‌బీ రహదారి వర్షానికి కొట్టుకుపోయింది. చాలా రోజులుగా మరమ్మతులు చేయటం లేదు. **-శ్రీను, ముత్యంపల్లి**

సమాధానం: వెంటనే మరమ్మతులు చేయిస్తాం. **-గులాబ్, ఆర్‌అండ్‌బీ ఏఈ**

మాక్లూర్ గ్రామీణం: గుత్ప గ్రామంలో మురుగు కాలువలు సరిగా లేకపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. జ్వరాలు ప్రబలుతున్నాయి. **-రాజు, గుత్ప**

సమాధానం: గుత్ప గ్రామంలో వెంటనే మురుగు కాలువలు శుభ్రం చేయిస్తాం. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయిస్తాం. **- శ్రీనివాస్, ఎంపీవో**

వీధి దీపాల ఏర్పాటు



నందిపేట్, న్యూస్‌టుడే: డొంకేశ్వర్ గ్రామంలోని కొన్ని కాలనీల్లో వీధి దీపాలు లేకపోవడంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో చీకటిగా ఉండడంతో బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. ఈ సమస్యను స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించారు. బుధవారం వివిధ కాలనీల్లో వీధి దీపాలు ఏర్పాటు చేశారు.

ఇళ్లపై కోతులు వీధుల్లో కుక్కలు

● భయాందోళనలో పట్టణవాసులు

న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం



ఆర్మూర్ హుస్నాబాద్ గల్లీలో

కోతుల గుంపులు వచ్చి ఇళ్లలోకి చొరబడుతున్నాయని, కొన్ని చోట్ల ఇళ్లపైకి చేరి కాలనీవాసులు నిద్రపోకుండా చుక్కలు చూపిస్తున్నాయి. కోతులను సైతం ఇక్కడినుంచి అడవులకు తరలించాలని యోచిస్తున్న నిధుల కొరతతో ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.



ఆర్మూర్ పట్టణ వ్యాప్తంగా శునకాలు, కోతుల బెడద తీవ్రమైంది. కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. వాటి నుంచి రక్షించాలని కోరుతున్నారు. అధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు. ముఖ్యంగా సిద్ధులగుట్ట విస్తరించి ఉన్న కాలనీల్లో కోతుల సమస్య తీవ్రంగా ఉంది. దాదాపు అన్ని వార్డుల్లో శునకాలు గుంపులుగా సంచరిస్తూ దాడులకు పాల్పడుతున్నాయి. ప్రతి నెల కుక్క, కోతుల వల్ల గాయపడిన వారి సంఖ్య 300పైగానే ఉంటుంది. ఇళ్ల నుంచి కాలు బయటపెట్టేందుకు నరకం చూపిస్తున్నాయని వాపోతున్నారు స్థానికులు.

ఏబీసీ చేసేందుకు ఒప్పందం

శునకాలకు ఏబీసీ(యానిమల్ బర్త్ కంట్రోల్) చేసేందుకు వీలుంది. ఆర్మూర్ పట్టణంలో శునకాలను పట్టి, ఏబీసీ చేసి వదిలేయాలి. పట్టణ వాసుల ఫిర్యాదుల నేపథ్యంలో పుర అధికారులు ముందడుగు వేశారు. రూ.10 లక్షలు వెచ్చించనున్నట్లు చెబుతున్నారు. ఒక్కో శునకానికి రూ.1800 ఖర్చుతో శస్త్ర చికిత్స చేసేందుకు నిజామాబాద్ కేంద్రంలో ఏబీసీ చేసే సంస్థతో బల్దియా ఒప్పందం చేసుకొంది. ఈ లెక్కన సుమారు 550 వరకు మగ శునకాలకు ఏబీసీ చేయనున్నట్లు చెబుతున్నారు.

ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి వచ్చిన బాధితులు

నెల	జూన్	జులై	ఆగస్టు	సెప్టెంబరు
కుక్క కాట్లు	203	220	186	177
కోతి..	148	128	118	110

త్వరలోనే సమస్య పరిష్కారం

శునకాల కట్టడికి బల్దియా నిధుల నుంచి రూ.10 లక్షలు వెచ్చించనున్నాం. వాటికి ఏబీసీ చేసేందుకు ఇది వరకే ఒప్పందం కుదుర్చుకున్నాం. త్వరలోనే ఈ ప్రక్రియ ప్రారంభం అవుతోంది. ప్రజల ఇబ్బందులు తొలగుతాయి. కోతుల బెడద తీవ్రంగా ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది.
- రాజు, బల్దియా కమిషనర్, ఆర్మూర్

1350 శునకాలు

పట్టణంలో 1350 పైగా శునకాలు ఉన్నట్లు అధికారుల గుర్తించారు. వాటిని పట్టి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు బల్దియా అధికారులు చేపడుతున్న చర్యలు నీరుగారిపోతున్నాయి. పెంపుడు జంతువులకు సంబంధించిన కొన్ని స్వచ్ఛంద సంస్థలు వాటిని తరలింపును అడ్డుకోవడంతో ప్రజల ఇబ్బందులు తొలగడం లేదు.

ఉండి ఏం లాభం?

☛ భవిత కేంద్రంలో పరికరాలు కరవు

ఏర్గట్ల(మోర్తాడ్), న్యూస్‌టుడే: మండలంలో భవిత కేంద్రం గత తొమ్మిది నెలల కిందట తాత్కాలిక భవనంలో ప్రారంభించారు. కేంద్రం ఏర్పాటైన వరకు పరికరాలు అందుబాటులోకి తీసుకురాలేదు. కనీసం ఫిజియోథెరపీ బల్ల కూడా లేదు. ప్రస్తుతానికి కేంద్రంలో నిర్వాహకుడు, తాత్కాలిక ఫిజియోథెరపిస్టు విధులు నిర్వహిస్తున్నారు. కేంద్రం నిర్వాహకుడు మధుశేఖర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా కేంద్రానికి పరికరాలు మంజూరయ్యాయని, టెండర్లు, పరికరాల సరఫరాలో జాప్యం జరిగి ఉండవచ్చు అని సమాధానమిచ్చారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అన్ని రకాల పరికరాలతో పక్కా భవనంలో కేంద్రం నిర్వహిస్తే శారీరక, మానసిక వైకల్యం కలిగిన పిల్లలకు ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు.



నిర్వహణ లోపించి.. పెచ్చులూడి

ఆర్మూర్ ఏరియా ఆసుపత్రి అంద విహీనంగా మారుతోంది. అద్దాల మేడగా అన్నీ హంగులతో నిర్మించినప్పటికీ పదేళ్లు నిండకుండానే శిథిలావస్థకు చేరుకుంటోంది. లోపల ఎక్కడికక్కడ నడక మార్గంలో, గోడలకు ఉన్న టైల్స్ ఊడిపోయాయి. ఆసుపత్రికి వచ్చిపోయే వారికి ఇది ఎబ్బెట్టుగా కనిపిస్తోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.



-న్యూస్‌టుడే, ఆర్మూర్

రూ.10 వేల జరిమానా

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ బస్టాండ్‌లోని ఓ హోటల్‌లో బల్దియా అధికారులు బుధవారం తనిఖీ చేశారు. వంటగది అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. ప్రజా ఆరోగ్యంతో చెలగాటం ఆడొద్దని సూచించారు. హోటల్ నిర్వాహకులకు రూ.10 వేల జరిమానా విధించినట్లు కమిషనర్ రాజు వెల్లడించారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీరు పూర్ణచౌలి, సిబ్బంది సంతోష్, రమేశ్, ప్రశాంత్, అక్షయ్ ఉన్నారు.

ర్యాలీ విజయవంతానికి పిలుపు

మోర్తాడ్, న్యూస్‌టుడే: టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఈనెల 4వ తేదీన నిజామాబాద్‌కు వస్తున్నారని, ఈ సందర్భంగా నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. మోర్తాడ్ మండలంలోని ప్రజాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మోర్తాడ్, ఏర్గట్ల మండలాధ్యక్షులు రాములు, దేవారెడ్డి, వైద్య, శివన్నల్లి శివకుమార్, దేవేందర్, ప్రవీణ్, మహిపాల్, అశోక్, ప్రవీణ్, అనిల్, గంగానర్సయ్య, సురేశ్, సాయరెడ్డి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్

రక్తదాన శిబిరం



ఆర్మూర్ గ్రామీణం: 'మా ఊరు స్వచ్ఛంద సేవా సంస్థ' 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలూర్ మండల కేంద్రంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 60 మంది యువకులు రక్తదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు, కార్యదర్శి రాంచందర్, అరుణ్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ఆంజనేయులు, చిన్న పోతన్న, డాక్టర్ సంకేత్, వినయ్, కాంగ్రెస్ నాయకులు ముక్కెర విజయ్, సంస్థ సభ్యులు నారాగౌడ్, రమేష్, వెంకటరమణ, మల్లేష్, మూలకిడి శ్రీనివాస్, ఉదయ్, నవనీత్, సంజీవ్, గంగాధర్, గంగారెడ్డి, లక్ష్మీనారాయణ, సుదర్శన్, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా డీజేలు పెడితే చర్యలు

బాల్కొండ, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా డీజేలు పెడితే చర్యలు తీసుకుంటామని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో బుధవారం బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లోని డీజే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆర్మూర్ గ్రామీణ సీఐ శ్రీధర్‌రెడ్డి, బాల్కొండ, మెండోరా, ముప్కాల్ ఎస్సైలు నరేష్, నారాయణ, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

మంత్రి ఉత్తమ్‌కు పరామర్శ



ఆర్మూర్: ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జులు వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డిలు బుధవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని, ఆయన సతీమణి కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని కలిసి పరామర్శించారు. ఇటీవల మంత్రి తండ్రి పురుషోత్తంరెడ్డి మృతి చెందడంతో హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి వెళ్లి నివాళులర్పించారు.

వరద గేట్ల మూసివేత

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద చేరిక 19,860 క్యూసెక్కులకు తగ్గింది. మిగులు జలాలు విడుదల కోసం ఎత్తిన ఆరు వరద గేట్లను బుధవారం మధ్యాహ్నం మూసివేసినట్లు ఏఈఈ కొత్త రవి తెలిపారు. ముప్కాల్ మండలం రెంజర్ల వద్ద కాకతీయ కాల్వలో ఒకరు పడి పోవడంతో కాల్వకు నీటి విడుదల నిలిపివేసినా సాయంత్రానికి తిరిగి నీళ్లు వదిలారు.

మహాత్ముడికి నివాళులు



ఆర్మూర్ బల్దియా కార్యాలయంలో..



వేల్పూర్‌లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మాక్లూర్: మాక్లూర్ మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి శిక్షణ కలెక్టర్ సంకేత్‌కుమార్, అధికారులు నివాళులు అర్పించారు. ఎంపీవో శ్రీనివాస్, ఉపాధి హామీ ఏపీవో ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: గాంధీనగర్‌లో గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో రాజశ్రీనివాసు రోడ్డును శుభ్రం చేశారు.

వేల్పూర్(కమ్మర్‌పల్లి): వేల్పూర్‌లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

ఆర్మూర్ పట్టణం: ఆర్మూర్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుర ఛైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య, వైస్ ఛైర్మన్, కమిషనర్ మొక్కలు నాటారు. జర్నలిస్టు కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నందిపేట్ గ్రామీణం : అయిలాపూర్‌లోని జూనియర్ కళాశాలలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ చిన్నయ్య పాల్గొన్నారు.

ఏర్గట్ల: వివిధ గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వీధులను చీపుర్లతో శుభ్రం చేశారు.

నందిపేట్: నందిపేటలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్, నాయకులు పాల్గొన్నారు.



ఏర్గట్ల మండల కేంద్రంలో..

బాల్కొండ: బాల్కొండలోని బాపూ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, బాపూజీ మందిరం వద్ద విగ్రహానికి ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, కిసాన్‌నగర్‌లో విగ్రహానికి పలువురు పూలమాలలు వేశారు. శ్రీరామసాగర్ ప్రాజెక్టు కార్యాలయం, జల విద్యుత్తు ఉత్పాదన కేంద్రంలో నివాళులర్పించారు. ప్రాజెక్టు ఈఈ చక్రపాణి, డిప్యూటీ ఈఈలు గంగామోహన్, సుకుమార్, రఘుపతి, గణేష్, ఏఈఈ మాణిక్యం,జెన్‌కో సీఈ రమేష్‌బాబు, జెన్‌కో ఇంజినీర్లు సతీష్, భరత్, నరేష్ పాల్గొన్నారు.

భీమ్‌గల్: భీమ్‌గల్ బస్టాండ్ ఆవరణలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రేమలత గాంధీ విగ్రహానికి పూల మాలలు వేశారు.

మోర్తాడ్: మోర్తాడ్‌లో గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.



అయిలాపూర్ కళాశాలలో..



ఆర్మూర్‌లో భాజపా నాయకులు



మాక్లూర్‌లో శిక్షణ కలెక్టర్



జల విద్యుత్తు ఉత్పాదన కేంద్రంలో..



శ్రీరామసాగర్ ప్రాజెక్టు కార్యాలయంలో..




కమ్మర్‌పల్లిలో రోడ్డును శుభ్రం చేస్తున్న ఎంపీడీవో రాజశ్రీనివాసు



పల్లికొండ గ్రామంలో..

కాకతీయ కాల్వలో దూకి ఆత్మహత్య



జగదీశ్వర్

ముప్కాల్, న్యూస్‌టుడే: రెంజర్లకు చెందిన కర్తన్ జగదీశ్వర్(58) కాకతీయ కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్‌ఐ రజినీకాంత్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. జగదీశ్వర్ మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన జగదీశ్వర్ గ్రామ శివారులో కాకతీయ కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి శివారులో రైల్వే వంతెన సమీపంలో కాల్వలో మృతదేహం బుధవారం లభించిందని ఎస్సై తెలిపారు.

ఆగిన రైలులో...

నిజామాబాద్ నేరవిభాగం: రైలులో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బోధన్ రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న గుంతకల్ ప్యాసింజర్ రైలులో 55 ఏళ్ల వ్యక్తి టవల్‌తో ఉరేసుకున్నారు. గమనించిన మేనేజర్ నవీన్‌కుమార్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయిరెడ్డి తెలిపారు.

క్రైమ్ కార్నర్

తల్లి మందలించినందుకు బాలిక..

నిజామాబాద్ నేరవిభాగం: రెండో ఠాణా పరిధిలో ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ఓ బాలికను పదే పదే బయట తిరగొద్దని తల్లి మందలించినందుకు క్షణికావేశంతో మూడు రోజుల కిందట ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. తల్లి హుటాహుటిన బాలికను జిల్లా జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మంగళవారం రాత్రి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

చికిత్స పొందుతూ మృతి

నందిపేట్: నందిపేట్ గ్రామానికి చెందిన నరేందర్(31) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నరేందర్ గల్ఫ్ వీసా కోసం ఓ ఏజెంటును సంప్రదించి డబ్బులు ఇచ్చాడు. వీసా రాకపోవడంతో గత నెల 29వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని దవాఖానాకు తరలించారు. మంగళవారం ఆసుపత్రిలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

నందిపేట్, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు బుధవారం గోసంగి సంఘం నాయకులు ఆర్థిక సహాయం చేశారు. మారంపల్లి గ్రామానికి చెందిన సిరిగిరి సాయిలు ఇటీవల గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడు. నందిపేట్ గ్రామానికి చెందిన కన్నయ్య చెరువులో దిగి నీట మునిగి మృతి చెందాడు. వీరి కుటుంబాలను వినోద్‌కుమార్, రాజు పరామర్శించి రూ. 5వేల చొప్పున ఆర్థిక సహాయం చేశారు.

అన్నప్రసాద వితరణ

ఏర్గట్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆలయ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అన్నప్రసాద వితరణ చేశారు. గ్రామస్థులు, మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన బద్దం శ్రీనివాస్ దంపతులు అన్నప్రసాద వితరణకు ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు సమితి సభ్యులు తెలిపారు.

అవీ...ఇవీ.. అన్నీ

ఎల్‌వోసీ అందజేత

ఆర్మూర్ పట్టణం: ఆర్మూర్‌లోని అరుంధతి నగర్‌కు చెందిన వైష్ణవి అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2 లక్షల ఎల్‌వోసీ బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

ముప్కాల్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని చైతన్య యువజనసంఘం మైదానంలో ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో ఒకరోజు కబడ్డీ పోటీలు నిర్వహించారు. అండర్ 16 విభాగంలో 55 కేజీల బరువు విభాగంలో జిల్లా స్థాయి ఇన్విటేషన్ టోర్నమెంట్ జరిపారు. ఇందులో 14 జట్లు పాల్గొనగా సిర్నాపల్లి ప్రథమ, కిసాన్‌నగర్ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు జిలా కబడ్డీ సంఘం కార్యదర్శి గంగాధర్ బహుమతులు ప్రదానం చేశారు. అకాడమీ ప్రతినిధులు, అంజయ్య, పీడీ రాజ్‌కుమార్, అనిల్, సంజీవ్, గంగామోహన్, యాదగిరి, సాయిలు పాల్గొన్నారు.



విజేతలతో కబడ్డీ సంఘం ప్రతినిధులు

శాపూర్‌లో భూ వివాదం

నందిపేట్, న్యూస్‌టుడే: శాపూర్ గ్రామంలో ఇరు వర్గాల మధ్య భూ వివాదం నెలకొంది. నికాల్‌పూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శాపూర్ శివారులో భూమి సాగు చేసుకుంటున్నాడు. భూమి నల్ల పోచమ్మ దేవతకు సంబంధించిందని చాలా రోజులుగా శాపూర్ వాసులు చెబుతున్నారు. కొంత కాలంగా వివాదం కొనసాగుతోంది. బుధవారం సదరు వ్యక్తి పంట కోసి ధాన్యాన్ని తీసుకెళ్తుండగా శాపూర్ గ్రామస్థులు అక్కడకు చేరుకొని ఆందోళన చేశారు. ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు.

ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు

ఆర్మూర్ పట్టణం: కొటార్మూర్‌లో తాటి చెట్లు నరికివేశారని గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఆర్మూర్ ఎక్సైజ్ కార్యాలయంలో ఎస్సై ప్రభాకర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. నాలుగు చెట్లను నరికివేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షుడు గంగాధర్, ఉపాధ్యక్షుడు నరేశ్, సభ్యులు సాగర్, శ్రీనివాస్, వెంకటేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

వన్నెల్(బి)లో గ్రామ సభ

బాల్కొండ: వన్నెల్(బి) పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి, ఎంపీవో గంగామోహన్ అధ్యక్షతన గ్రామ సభ బుధవారం జరిగింది. ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. సమస్యల పరిష్కారం కోసం తీర్మానం చేశారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీభాషిత పాఠశాల ఉపాధ్యాయులకు బుధవారం వర్క్‌షాప్ (శిక్షణ) కార్యక్రమం నిర్వహించారు. గొప్ప ఉపాధ్యాయులుగా ఎదిగేందుకు అనుసరించాల్సిన బోధనా నైపుణ్యాలు, విధానాలు, విలువల గురించి శిక్షకుడు శ్రీకాంత్‌రెడ్డి వివరించారు.